త్వరలోనే రాజాసాబ్ టీజర్ విడుదల సన్నాహాల్లో మూవీ బృందం

మిగతాది 8లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 131 | ఆదివారం ఏప్రిల్ 27 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

## ఇదండీ..కబురు..




## విద్వేష రాజకీయాలకు ప్రేమతోనే మా సమాధానం

# యువత రాజకీయాల్లోకి రావాలి




- అప్పుడే దేశ ప్రగతి ముందుకు సాగుతుంది
- భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో రాహుల్
- రాహుల్‌కు ఘనంగా స్వాగతం పలికిన సిఎం తదితరులు

**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** విద్వేష రాజకీయాలకు ప్రేమే మా సమాధానమని రాహుల్ అన్నారు. హిందీలో ఓ స్లోగన్ తీసుకున్నాం.. విద్వేషం అనే బజార్ లో ప్రేమ అనే దుకాణం తెరిచా (నఫ్రత్ కే బజార్ మే.. మే.. మహబత్ కే దుకాన్) అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు- వ్యక్తం చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. ' ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయి. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనైపోయింది. మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు' అంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు- రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు. భారత్ సమ్మిట్-2025కు నిన్ననే రావాల్సి ఉండే.. కానీ, కాశ్మీర్ కి వెళ్లాను.. క్షమించండి.. ఈ సమ్మిట్ నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు. ఇక, రాజకీయాల్లో కొత్త జనరేషన్ రావాలి.. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయి.. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు అని ఆయన తెలిపారు. ఇక, భారత్ జోడో యాత్రలో 4 వేల కిలోమీటర్లు నడిచా.. కన్యాకుమారి నుండి పాదయాత్ర మొదలు పెట్టా.. 10 రోజుల తర్వాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగిపోయింది.. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.. సగం దూరం నడిచేటప్పటికి నేను గతంలో లాగా లేను.. ప్రజలతో ఎలా మాట్లాడాలో.. వారి సమస్యలు ఎలా వినాలో నేర్చుకున్నా.. నేను గతంలో ఎప్పుడూ ప్రజలపై ఉన్న ప్రేమను వ్యక్తపరచలేదు అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

మిగతాద్ది 2 లో

## తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా?

– మంత్రి కోమటిరెడ్డి



**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. "తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళ్లు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారు" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## శివాలయం ధ్వంసం చేస్తే స్పందించరా

- మదర్సాలో పిల్లల దాడిపై చర్యలేవీ
- డిజిపిని కలిసి చర్చించిన ఎంపి రఘునందన్



2లో..

**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో శివాలయం ధ్వంసం చేసినా పోలీసులు సకాలంలో స్పందించలేదని మెదక్ ఎంపీ రఘునందన్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ జితేందర్ రెడ్డితో ఘునందన్ రావు భేటీ- అయ్యారు.

## కర్రెగుట్టల్లో కాల్పుల మోత..

# 37కి చేరిన మావోయిస్టుల మృతుల సంఖ్య .!



2 లో

**కబురు న్యూస్,చత్తీస్ ఘడ్ ఏప్రిల్ 26:** తెలంగాణ, చత్తీస్ ఘడ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కూంబింగ్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఏకంగా మావోయిస్టుల మృతుల సంఖ్య 37కి చేరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఆపరేటన్ కాగర్ పేరుతో.. కొన్ని నెలలుగా కర్రెగుట్టల్లో మావోల వేట సాగిస్తున్నారు CRPF బలగాలు. ప్రత్యేక హెలికాప్టర్లతో నిఘా పెట్టారు.



## లీవ్ ఇండియా పేరుతో నోటీసులు - తెలంగాణ డీజీపీ

**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు పాకిస్తానీలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. 'సాక్షి' తో మాట్లాడిన డీజీపీ జితేందర్.. తెలంగాణలో 230 మంది పాకిస్తానీయులు ఉన్నారు.

02

## సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి

- తెలంగాణ చరిత్రలో కీలక అభివృద్ధి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



2 లో

**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇది తెలంగాణ ఇరిగేషన్ చరిత్రలో లాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కృషి ఫలించిందన్నారు. ఇరిగేషన్ శాఖలో ఇది ముందడుగని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గోదావరి నదీ జలాలలో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో మేడిగడ్డ కూలిపోయిందని..సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందన్నారు. సీడబ్ల్యూసీకి అన్ని వివరాలు పంపితే అప్పుడు అప్రూవల్ ఇచ్చారని వెల్లడించారు. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. ముంపు నష్టం.. ప్రొ-టె-క్షన్ వాల్ కోసం కేంద్రం నిధులు ఇవ్వాలని అడిగామని.. అందుకు కేంద్రం కొంత అనుకూలంగా ఉందని తెలిపారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణ రైతులకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణకు ఎక్కువ భాగం ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వర్కౌట్ చేస్తోందన్నారు.

## పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు


### - కేంద్ర మంత్రి బండి సంజయ్



**కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 26:** పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంసీహెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 100 మందికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని చెప్పారు. పహల్గాం ఘటన ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. భిక్షమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న భారత్‌ను చూసి ఓర్వలేకపోతోందని విమర్శించారు. ప్రధాని మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అంతా అండగా నిలవాలన్నారు.రోజ్‌గార్ మేళాలో కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు బండి సంజయ్ అభినందనలు తెలిపారు. ఇష్టపడి పనిచేసి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు చిట్టచివరి వ్యక్తికి కూడా అందేలా చేయాలన్నారు.

## బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ లేదు

- తెలంగాణ లేకపోతే ఇంత అభివృద్ధి ఉండేది కాదు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్య



మిగతాది 2లో

**కబురు న్యూస్,వరంగల్,ఏప్రిల్ 26:** బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ లేదు.. తెలంగాణ లేకపోతే ఇంత అభివృద్ధి ఉండేది కాదని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తెలంగాణ ప్రజల పక్షంలోనే బీఆర్ఎస్ ఉంటుంది అని హరీష్ రావు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా చేరుకున్న మాజీమంత్రి హరీష్ రావు కి బీఆర్ఎస్ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభా ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పరిశీలించారు. సభకు వచ్చే కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఇక, హరీష్ రావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో అతి పెద్ద సభకు వేదిక నిలిచింది.. ఇప్పటికి సభ ఏర్పాట్లు- పూర్తయ్యాయి..

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే




స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి.మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది.మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి.వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు.ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది.కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది.ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది.కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది.గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

# శివాలయం ధ్వంసం చేస్తే స్పందించరా

మొదటి పేజీ తరువాయి
ఘటన మధ్యాహ్నం జరిగితే రాత్రి దాకా పోలీసులు రాలేదు.. కేవలం హిందువుల మీద 4 ఎఫ్ఐఆర్లు పెట్టారు.. నాలుగు పేర్లు రాసి ఆదర్స్ అని రాసి బీజేపీ, హిందూ కార్యకర్తలను ఇష్టం వచ్చినట్టు- అరెస్ట్ చేస్తున్నారు.. పక్కన ఉన్న మదర్సాలోని పిల్లలను కూడా హిందువులే పోలీసులకు అప్పజెప్పారు.. ఇప్పటికే 19 మంది జైలుకు పోయారు.. ఇంకా అరెస్ట్ చేస్తూనే ఉన్నారు.. సీసీ కెమెరాలు బాగున్నాయి.. కమాండ్ కంట్రోల్ ఉందని పోలీసులు.. రాత్రి దాకా ఎందుకు స్పందించలేదు అని డీజీపీని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. అయితే, అక్కడ మదర్సలోఉన్న పిల్లలు ఈ దేశం పిల్లలు అని మీ ఎస్పీ చెప్పగలరా అని ఎంపీ రఘునందన్ రావు అడిగారు. టోపీ పెట్టుకుంటే మనోడు అని కాపాడుతున్నారు.. అక్కడ మదర్సలో ఉండే 12 ఏండ్లలోపు పిల్లలకు హిందూ సమాజంపై ద్వేషం ఎందుకు..నేర్పుతున్నారని ప్రశ్నించారు. అక్కడ విగ్రహం పగిలిన తర్వాత మదర్స పిల్లలు లోపలికి పోయి వచ్చిన వీడియోలు ఎందుకు బయటకు రావు అని మండిపడ్డారు. రామాలయం జాగాలో మదర్స ఎట్లా వచ్చింది కలెక్టర్.. ఆ మదర్సలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్ళో చెప్పండి అని డిమాండ్ చేశారు. శివనగర్, సదాశివ పేటలో ఉన్నట్టు వంటి మదర్సలో ఉన్నోళ్లు ఏ దేశం వాళ్ళు అని అడిగారు. దీంతో పాటు- రాష్ట్రంలో ఉన్న ప్రతీ మదర్సలోని వారందరూ ఏ రాష్ట్రం, ఏ దేశం వాళ్ళు.. వారికి ఏం నేర్పిస్తున్నారో సీఎస్, డీజీపీ చూడాలన్నారు. ఇక, ముత్యాలమ్మ దేవాలయం సంఘటన తర్వాత మీ ఇం-టె-లిజెన్స్ ఎందుకు వైఫల్యం చెందింది.. అక్కడ ఏం జరిగిందని గుమిగూడిన అందరినీ రిమాండ్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అని రఘునందన్ రావు పేర్కొన్నారు. ఇక, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భారత ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తెలంగాణతో పాటు- హైదరాబాద్ లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, రోహింగ్యాలను వెళ్లగొట్టకపోతే భాగ్య నగరం మండుతుందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

హైదరాబాద్ లో 70 వేల మంది రోహింగ్యాలు ఉన్నారని అంటున్నారు.. ఇంతకీ ఏం జరుగుతున్నాదని ప్రశ్నించారు. గతంలో డీజీపీ ఆఫీసు మీద బురఖాలో వచ్చి దాడి చేసిన ఘటనను మర్చిపోవద్దని గుర్తు చేశారు. అహింసో పరమో ధర్మో అనేది మా నినాదం కానీ మమ్మల్ని ఇబ్బంది పెడితే హింస ఉంటది అని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

## విద్వేష రాజకీయాలకు ప్రేమతోనే మా సమాధానం

మొదటి పేజీ తరువాయి
కానీ, ఈ పాదయాత్రలో నేను ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరచగలిగాను అని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. నేను ఎప్పుడైతే ప్రజలపై నా ప్రేమను వ్యక్తపరిచానో అప్పటినుంచి అందరూ స్పందిస్తున్నారని తెలిపారు. యాత్రలో కొన్ని సార్లు స్టక్ అయ్యాను.. అప్పటి నుంచి నన్ను చాలా మంది ఇష్టపడటం మొదలు పెట్టారు.. ఓ చిన్న అమ్మాయి వచ్చి లవ్ యూ అని చెప్పింది.. ఆ తర్వాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్ ప్రెస్ చేస్తూ వచ్చాను అన్నారు. శుక్రవారం ప్రారంభం అయిన ఈ కార్యక్రమంలో 100 దేశాలకు చెందిన 450 మంది ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్ చివరి రోజున ఈ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అంతకు ముందు విమానాశ్రయంలో ఆయనకు సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు స్వాగతం పలికారు.

## సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి

మొదటి పేజీ తరువాయి
ఎన్‌డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ మాట్లాడే తీరు ఖండిస్తున్నామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర తాము ప్రాజెక్ట్ మొదలుపెట్టామని.. బీఆర్ఎస్ తమకు పేరు వస్తుందని రీడిజైన్ చేసి... లక్షన్నర కోట్లకు పెంచారని అన్నారు. కాళేశ్వరం కట్టిన డబ్బు బీఆర్ఎస్ వాళ్ళ జేబులో నుంచి కట్టలేదన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్ తాకట్టు- పెట్టి మరీ కట్టారని మండిపడ్డారు. వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలిందని అన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ చూస్తే ఎంత దుర్మారం చేశారో అర్ధం అవుతోందన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లో విషయాలు తెలంగాణ ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి షిఫ్ట్ చేసి అన్యాయం చేశారని..ద్రోహం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డనే కాదు.. సుందిళ్ళ, అన్నారం కూడా ప్రమాదంలో ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. లక్ష కోట్లు- దోపిడి చేసిన వాళ్లకు ఎలాంటి శిక్ష వేయాలో ఆలోచించాలన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై సమీక్ష చేస్తామన్నారు. బీఆర్ఎస్ లాగా చిల్లర ఆలోచనలు తమకు ఉండవన్నారు. 'మీ సభ ఎప్పుడూ ఉందో ఎన్‌డీఎస్ఏకు ఏం తెలుసు. అబద్ధపు మాటలు ఆపండి. ఎన్‌డీఎస్ఏ సూచనలే మేము నమ్ముతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## 37కి చేరిన మావోయిస్టుల మృతుల సంఖ్య .!

మొదటి పేజీ తరువాయి
ఈ క్రమంలోనే 2025, ఏప్రిల్ 25వ తేదీ రాత్రి.. కర్రెగుట్టల్లో సీఆర్ పీఎఫ్ బలగాలకు.. మావోయిస్టులు ఎదురుపడ్డారు. రెండు వర్గాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో.. 28 మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. మావోల ఎన్ కౌంటర్?పై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కర్రెగుట్టల్లో మొత్తం వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు భద్రతా బలగాలు.2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇందు కోసం ఆపరేషన్ కగార్ చేపట్టింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణ-ఛత్తీస్ గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ కీలక నేత హిడ్మాతో పాటు మరో వెయ్యి మందికి పైగా నక్సలైట్లు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది.

దీంతో కర్రెగుట్టలో ఐదు రోజుల నుంచి కేంద్ర, రాష్ట్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. తెలంగాణ-ఛత్తీస్?గఢ్-మహారాష్ట్ర మూడు వైపుల నుంచి కర్రెగుట్టలను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. హిడ్మాతో పాటు మరికొందరు కీలక నేతలే లక్ష్యంగా భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో భద్రతా దళాలు, మవోయిస్టుల మధ్య భీకర ఎదురు కాల్పులతో కర్రెగుట్టలు తుటాల మోతతో దద్దరిల్లుతున్నాయి.శనివారం (ఏప్రిల్ 26) భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో 28 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. దీనిపై అధికారులు, ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. భారీ ఎన్?కౌంటర్ నేపథ్యంలో ఛత్తీస్?గడ్, తెలంగాణా సరిహద్దు కర్రెగుట్టల్లో యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఏ క్షణాన ఏ జరుగుతుందోనని సమీప గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.మరోవైపు కర్రెగుట్టల్లో కేంద్ర, రాష్ట్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్ వెంటనే ఆపేయాలని ఇప్పటికే మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని.. నెలరోజుల పాటు ఆపరేషన్ కగార్ ఆపాలని విజ్ఞప్తి చేసింది. మావోయిస్టు పార్టీ అభ్యర్ధనను ఏ మాత్రం లెక్కచేయని భద్రత దళాలు నక్సలైట్ల ఏరివేత లక్ష్యంగా కర్రెగుట్టల్లో ముందుకు వెళ్తున్నాయి.

## బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ లేదు

మొదటి పేజీ తరువాయి
ఇప్పటికే జనం సభకి తరలి వస్తున్నారు.. మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఒక్క పథకం ఇవ్వడం లేదని హరీష్ రావు ఆరోపించారు. వాళ్ళు చెప్పిన పథకాలు ఇవ్వక పోయినా.. గతంలో ఉన్న పథకాలు అమలు చేయడం లేదన్నారు. శృతి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆదాయం తగ్గిపోయింది.. పాలన చేతకాక రేవంత్ మాట తప్పిండు.. రుణామాఫీ చేస్తానని మోసం చేసిండు.. అసెంబ్లీలో తప్పుడు ప్రకటన చేసి.. రైతులను మోసం చేశారు.. రైతుల కోసం పని చేసింది కేవలం కేసీఆర్ ప్రభుత్వం మాత్రమే.. కాంగ్రెస్ మోసం చేసిన తీరుకు ఈ సభకు అన్ని వర్గాల వాళ్ళు వస్తున్నారు.. కాంగ్రెస్ కు పరిపాలన చేతకాక పంటలను ఎండ బె-ల్గ÷టింది అని హరీష్ రావు మండిపడ్డారు. అయితే, నీళ్ల లేక కాదు పాలన చేతకాక పంటలను ఎండ బెట్టింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. నీళ్లు ఉన్న పంటలు ఎండిపోయాయంటే.. ఇది చేత కానీ ప్రభుత్వం.. దద్దమ్మ ప్రభుత్వం అంటూ తీవ్రంగా మండిపడ్డాడు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మోటర్లు అన్ చేయకపోవడంతో రాష్ట్రంలో పంటలు ఎండిపోయాయి.. జనం స్వచ్ఛందంగా వచ్చే ప్రయత్నం చేస్తున్నారు.. ఇక, కేసీఆర్ సభ పైనా ప్రజల కంటే కాంగ్రెస్ నాయకులకే ఇం-టె-స్ట్ పెరిగింది అని సె-టైర్ వేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారు అని కాంగ్రెస్ నేతలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని హరీష్ రావు తెలిపారు.

## లీవ్ ఇండియా పేరుతో నోటీసులు - తెలంగాణ డీజీపీ

మొదటి పేజీ తరువాయి
వీరిలో 199 మంది లాంగ్ టర్న్ వీసాలు కలిగి ఉన్నారు.
కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఈ లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నవారి జోలికి వెళ్లట్లేదు. మిగిలిన 31 మందికి షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నాయి. ఈ షార్ట్ టర్మ్ వీసాలు కలిగి ఉన్న వారిని గుర్తిస్తున్నాము.లీవ్ ఇండియా పేరుతో ఇప్పటికే కొంతమందికి నోటీసులు ఇచ్చాము. హెల్త్ బేస్ మీద వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు టైం ఉంది. మిగిలిన వారు రేపు తిరిగి వెళ్ళిపోవాలి. ఈ నెల 30 వరకు అటల్ బోర్డర్ నుండి వెళ్ళిపోవచ్చు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. షార్ట్ టర్మ్ వీసాలు ఉండి తిరిగి వెళ్ళిపోని పాకిస్తానీయులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. ఇమ్మిగ్రేషన్ అధికారులతో కలిసి కో ఆర్డినేషన్ లో జాయింట్ ఆపరేషన్ చేస్తాము. కర్రెగుట్టలో తెలంగాణా పోలీస్ శాఖ నుండి ఎలాంటి ఆపరేషన్ లేదు. మా బలగాలు తెలంగాణ ప్రాంతంలో ఉన్న కర్రెగుట్టల వద్ద ఎలాంటి బలగాలు మోహరించలేదు. ములుగులో కూంబింగ్ కి తెలంగాణ పోలీసులకు సంబంధం లేదు' అని డీజీపీ జితేందర్ తెలిపారు.

# సింధూజలాల నిలిపివేత నిర్ణయం

**- పాక్‌లో తీవ్ర నీటి సంక్షోభం**
**- తాజా పరిస్థితులపై మీమ్స్**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్తాన్‌కు సింధు జలాలను సరఫరా కాకుండా నిలిపి వేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో పాక్ అల్లాడుతోంది. అసలే నీటి కొరతతో అల్లాడి పోతున్న పాకిస్తాన్‌కు భారత్ నిర్ణయంతో పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. నీటి సరఫరా నిలిపి వేయడాన్ని పాకిస్తాన్ తీవ్రంగా తప్పుబట్టింది. నీటిని నిలిపివేయటం యుద్ధానికి కాలు దువ్వటమే అంటూ మండిపడింది. మొత్తానికి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించింది. అయితే, గత కొద్దిరోజుల నుంచి నీటి సరఫరా లేకపోవటంతో పాకిస్తాన్‌లోని చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితి ఏర్పడింది. తాగడానికి కూడా నీళ్లు లేకుండా అక్కడి జనం అల్లాడుతున్నారు. భారత్.. పాక్‌కు నీటి సరఫరా ఆపివేయటం, అక్కడి పరిస్థితులపై సోషల్ మీడియాలో ఫన్నీ మీమ్స్, వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి. పాకిస్తాన్‌కు చెందిన వారే ఈ మీమ్స్, వీడియోలు పోస్టు చేయటం గమనార్హం. వారిపై వారే సెటైర్లు వేసుకుంటూ ఉన్నారు. ఫైజన్ అనే పాకిస్తాన్ నెటిజన్.. నీటిని ఇవ్వాలంటూ చేతులు జోడించి వేడుకున్నాడు. చాలా మంది పాకిస్థానీలు తమ పరిస్థితిని కామెడీగా ప్రపంచానికి తెలియజేస్తున్నారు. మరికొంతమంది మాత్రం బాధపడుతూ కామెంట్లు- చేస్తున్నారు. ఇండియా పాకిస్తాన్ మీద బాంబు వేస్తే.. ఇంతటితో గొడవ ముగుస్తుందని ఓ పాకిస్తానీ నెటిజన్ కామెంట్ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం పాకిస్తానీల వీసాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. సాధారణ వీసాల గడుపు రేపటితో తీరనుంది. మెడికల్ వీసాల గడువు 29 వరకు ఉంది. గడువు తేదీ కంటే ముందే పాకిస్తానీలు ఇండియా వదిలి వెళ్లిపోవాలని విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్తానీలు తమ దేశానికి క్యూలు కట్టారు. సరిహద్దు దగ్గర పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల వరకు లైను ఉంది. అందరూ తమ తట్టా బుట్టా సర్దుకుని పాకిస్తాన్ వెళ్లిపోతున్నారు. భారత్ తీసుకున్న నిర్ణయంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయింపు

- ఏటా భూ రికార్డుల ఆధునీకరణ... రైతులకు ఉచిత న్యాయ సేవలు... భూభారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ వెల్లడి...



- మాట్లూర్ మండల కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్...



-నందిపేట్ మండల కేంద్రంలో...





**కబురు న్యూస్,నిజామాబాద్ ఏప్రిల్ 26 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్.ఓ.ఆర్ - 2025)నూతన చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూ కమతాలకు భూదార్ నెంబర్లను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.నిర్దిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్, నందిపేట,ఆర్మూర్ మండల కేంద్రాలలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. ఇదివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు.భూధార్ నెంబర్ కేటాయిపు వల్ల భూ ఆక్రమణలకు,అనవసర వివాదాలకు అవకాశం ఉండదని, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు,భరోసా లభిస్తుందని అన్నారు.భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు ధరణిలో అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తూ నూతన చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్,ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి,భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఆ అర్జీలను 60 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తారని సూచించారు.ఒకవేళ రైతులు సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.ఈ మేరకు ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు.గతంలో ధరణి వల్ల భూ వివాదాల పరిష్కారం కోసం సివిల్ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారన్నారు.కానీ భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థ, రెవెన్యూ కోర్టుల వల్ల చాలా వరకు భూ సమస్యలు తహసీల్దార్,ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.రెండంచెల అప్పీలు వ్యవస్థతో పాటు సీసీఎల్ఏ కు రివిజన్ అధికారాలు కల్పించారని సూచించారు. అప్పీలు చేసుకున్న చిన్న,సన్నకారు,పేద వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు.గతంలో రికార్డులు చూసి రిజిస్ట్రేషన్లు చేసేవారని,కొత్త ఆర్ఓఆర్ చట్టంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి,సమగ్ర విచారణ జరిపిన తరువాతనే రిజిస్ట్రేషన్లు చేస్తారని అన్నారు.భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాల్లో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూమి పటం(మ్యాపు)పొందుపరుస్తారని వివరించారు.ఈ చట్టంలో నివాస స్థలాలు, గ్రామకంఠం,ఆబాది స్థలాలు, వ్యవసాయేతర భూముల వివరాలను కూడా పొందుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న సుమారు 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు భూభారతి చట్టం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం ఏర్పడిందని,హై కోర్టు విధించిన స్టే ఉత్తర్వులు తొలగిన మీదట వీటిని క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనున్నదని కలెక్టర్ వివరించారు.ప్రతీ సంవత్సరం డిసెంబర్ 31న రికార్డుల ఆధునీకరణ చేస్తారని అన్నారు.భూ సమస్యలు ఉన్న రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నూతన చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ,17 రాష్ట్రాలలో నిపుణులు సమగ్ర అధ్యయనం చేసి,అన్ని రకాల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపయుక్తంగా ఉండేలా ప్రభుత్వం భుభారతి నూతన చట్టం రూపొందించిందని తెలిపారు.ధరణి పోర్టల్ కారణంగా భూ సమస్యలు పెరిగిపోయాయని అన్నారు.అప్పుడు కేవలం భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్ కి ఉండేదని,నూతన చట్టంతో అధికార వికేంద్రీకరణ జరిగి కింది స్థాయి అధికారులకు కూడా అధికారాలు కల్పించారని తెలిపారు.ఏవైనా భూసమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు.నిర్ణీత గడువు లోపు దరఖాస్తులను పరిష్కరిస్తారని అన్నారు.ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు.ఈ సదస్సులలో నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి,ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్,మార్కెట్ కమిటీలు,పీఏసీఎస్ చైర్మన్లు,తహసీల్దార్లు,ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రజతోత్సవ వేడుకలకు భారీగా తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త...





**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 26 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విలేకరుల సమావేశంలో రజతోత్సవ సభను ఉద్దేశించి మాట్లాడారు.బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ సభ కుంభమేళను తలపించేలా ఉందని అన్నారు.దేశం మొత్తం తెలంగాణలో నిర్వహించే రజతోత్సవ వేడుకను చూసేందుకు తహతహలాడుతున్నారని తెలిపారు.తెలంగాణలోని రాష్ట్ర ప్రజలు రజతోత్సవ వేడుకకు స్వచ్ఛందంగా వచ్చేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తన ప్రాణాలను లెక్కచేయకుండా తెలంగాణను తీసుకువచ్చారని తెలిపారు.ఉద్యమం నుంచి వెనక్కి వస్తే రాళ్లతో కొట్టి చంపండని చెప్పిన మాట గుర్తు చేశారు.దేశంలో తెలంగాణను 29వ రాష్ట్రంగా తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కోసం పనిచేసిన పార్టీగా అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగింది. కళ్యాణ్ లక్ష్మి,షాది ముబారక్,రైతుబంధు,రైతు బీమా,దళిత బంధు,బీసీ బంధు,24 గంటల విద్యుత్ అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదని అన్నారు. కరోనా విపత్తు వల్ల సంక్షోభం ఏర్పడిన పెన్షన్లు ఆగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు.రజతోత్సవ వేడుకల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు మరియు కార్యకర్తలు గులాబీ టీ షర్టు వేసుకొని హంగామా చేశారు.డీజే పాటలు పెట్టుకుని డాన్సులు వేశారు.మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల కార్యకర్తలతో స్టెప్పులు వేశారు.సారే రావాలి మళ్లీ కెసిఆర్ రావాలి అంటూ పాటలతో కేకలతో అదరగొట్టారు.అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతూ కిరణ్,దాదన్న గారి విఠల్ రావు ,నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,సుజిత్ సింగ్ ఠాకూర్,రవి చందర్,సత్య ప్రకాష్,దండు శేఖర్,మురళి, సాయిలు,నవీద్ ఇక్బాల్,ఇమ్రాన్,మతీన్, తదితరులు పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్త ఆధ్వర్యంలో భారీగా చేరికలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 35వ డివిజన్ సంబంధించిన నరేష్ ఆధ్వర్యంలో వందమంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని పార్టీలో చేరినట్లు తెలిపారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ కో ఆర్డినేటర్ గా గోపాలకృష్ణ



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 26 :** ప్రభుత్వ గుర్తింపు పొంది,తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన వారి ప్రతిభ ను గుర్తించి వెలుగులోకి తెస్తున్న సంస్థ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ సెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి నిజామాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ గా రాఘవాపురం గోపాలకృష్ణ ను నియమించారు.గోపాలకృష్ణ కంజర ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, దేశంలో ఇస్తున్న లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ తో సమానమని తెలిపారు.జిల్లాలో కూడా ఈ అవార్డు కు అర్హత గల వారిని గుర్తించి ఐకాన్ అవార్డు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారం,రూ.50 వేల నగదు అపహరణ...




**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,ఏప్రిల్ 26 :** నగరంలోని 4వ టౌన్ పరిధిలో ఉన్న పూలాంగ్ పాత బ్రిడ్జి వద్ద ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు.చిన్నయ్య అనే వ్యక్తి ఈ నెల 23న కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ కు వెళ్లగా శనివారం తెల్లవారుజామున దుండగులు ఇంటి తాళలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు.బీరువాను ధ్వంసం చేసి అందులోని మూడు తులాల బంగారం,రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు.అలజడికి పక్క ఇంట్లోనే ఉన్న చిన్నయ్య కుమారులు నిద్రలేవగా దుండగులు బైక్ లపై పరారయ్యారు.శనివారం ఉదయం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనా స్థలాన్ని నగర సీఐ శ్రీనివాస్ రాజు,ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు.స్థానికంగా రహదారుల వెంబడి ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ టోర్నీకి జిల్లా జట్టు



**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 26 :** తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం జడ్పీహెచ్ఎస్ కల్లెడ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపికను నిర్వహించారు.ఈ ఎంపిక ప్రక్రియకు నిజామాబాద్,కామారెడ్డి ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 50 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుగా ఖరారు చేసినట్లు నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ లు అన్నారు.వీరు తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆదిలాబాద్ జిల్లా లో నిర్వహించబోయే సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని అన్నారు.ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టీ విద్యాసాగర్ రెడ్డి పాల్గొని అదిలాబాద్ జిల్లా మందమర్రిలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘ సభ్యులు బాబురావు,పిడి రమణ వ్యాయామ ఉపాధ్యాయులు సౌజన్య,సంజీవ్,సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు

## మే1 నుంచి క్రికెట్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 26 :** నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు చంద్రసేన్ రెడ్డి,వెంకట్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణ శిబిరం మే 1 నుంచి మే 31 వరకు స్థానిక గిరిరాజ్ కళాశాలలో నీ మైదానంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.ఈ శిబిరం ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించబడుననీ,శిబిరంలో పాల్గొనే క్రీడాకారులు తెల్లని క్రికెట్ దుస్తులు,క్యాన్వాస్ షూషూ,క్రికెట్ కిట్ తమ వెంట తీసుకొని రావాలని వారు తెలిపారు.ఈ శిక్షణలో పాల్గొనే క్రీడాకారుల వయసు 12 సంవత్సరాలు పైబడి 25 సంవత్సరాలలోపు క్రీడాకారులు అర్హులు అని తెలియజేశారు.ఇతర వివరాలకు కోచ్ నయీమ్ 810 6060 600 కు సంప్రదించాలని కోరారు.

## గ్రామపంచాయతీ కార్మిక కుటుంబానికి10 పదివేల రూపాయల ఆర్థిక సాహాయం.

**కబురు న్యూస్, జమ్మికుంట ఏప్రిల్ 26**

జమ్మికుంట మండలం తనుగుల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ పైడిపల్లి సమ్మయ్య అను కార్మికుడి తల్లి మరణించినందున, శనివారం రోజున ఆయన ఇంటికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మరియుమండల గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు వెళ్లి పరామర్శించి జమ్మికుంట మండల యూనియన్ సహకారంతో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏండిగా రవీందర్రావు, లద్దనూరు కుమార్ కమిటీ సభ్యులు కోశాధికారి, మేక మల్ల రాము, సమ్మయ్య చేతికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పేరుగు అశోక్, ఆసాల సారయ్య, కమిటీ సభ్యులు, రాచపల్లి మొగిలి, రవి, భద్రయ్య, సంపత్, సతీష్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సర్వం సిద్ధం.

కబురు న్యూస్,హనుమకొండ జిల్లా ఏప్రిల్ 26

**1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ ఏర్పాట్లు**
**154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం**
**500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక**
**1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు**
**10 లక్షల వాటర్ బాటిళ్లు**
**16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు**
**వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు**
**పరిసరాల్లో 12 వైద్య శిబిరాలు**
**1,200 తాత్కాలిక మరుగు దొడ్లు**
**పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వాలంటీర్లు**



తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ పార్టీకి 25 సంవత్సరాలు నిండాయి. 2001లో ఏర్పడి 2014లో రాష్ట్రాన్ని సాధించే దాకా పుట్టిన గడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని పోరాటాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన తరువాత పదేండ్ల పాటు సుపరిపాలన అందించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది. 17 నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కేవలం 2.05% ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, స్వల్ప కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పదిహేడు నెలల నుంచి అద్భుతంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది.లగచర్లలో గిరిజన రైతులపై కాంగ్రెస్ చేసిన దాష్టీకాలను యావత్ దేశం దృష్టికి తీసుకుపోవడంలో బీఆర్ఎస్ విజయవంతం అయింది. మూసీ, హైడ్రా బాధితులకు అండగా నిలబడింది. మొన్నటి హెచ్?సీయూ విద్యార్థుల పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి 400 ఎకరాల పచ్చటి అటవీ భూమిని కాపాడుకుంది. అక్కడి వన్యప్రాణులకు నిలువ నీడ లేకుండా చేయాలనుకున్న రేవంత్ ప్రభుత్వ దమనకాండను దేశం ముందుంచింది. త్యాగాల పునాదుల మీద అవతరించిన తెలంగాణను ఖతం పట్టించాలనుకుంటున్న కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కుంటూనే తన 25 ఏండ్ల రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ రెడీ అయింది.తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించబోతున్నారు. లక్షలాదిగా తరలివచ్చే జనానికి, అందుకు తగ్గట్టుగానే తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ పార్టీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మహాసభ ప్రాంగణాన్ని 154 ఎకరాల్లో సిద్ధం చేసింది. 500 మంది కూర్చునేలా గులాబీ రంగులతో వేదికను తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట-పాట కోసం ప్రత్యేకంగా మరో స్టేజ్ ను ఏర్పాటుచేశారు. ఇక ఎల్కతుర్తికి వచ్చే అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముళ్ళచెట్లను తొలగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు. ఇక సభకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి దాదాపు 50 వేల వాహనాల వస్తాయని అంచనా వేస్తున్నారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించారు. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్షకు పైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు.

## శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం

- పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్
- జవహర్ లాల్ స్టేడియంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్

కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 26:
అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండము గోదావరిఖనిలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని వన్ టౌన్, రామగుండం సర్కిల్ సివిల్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు.ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డిసిపి కర్ణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్పూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్








ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి డీసీపీ గారు వివరించారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది..? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు..? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు. మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టిస్ చేపించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని సబ్ గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌర హక్కుల సంఘం ప్రజా సంఘాలు... ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో ప్రొఫెసర్ హరగోపాల్ మీడియా సమావేశం....




- ప్రొఫెసర్ హరగోపాల్ కామెంట్స్

కబురు న్యూస్, హనుమకొండ ఏప్రిల్ 26.
ఛత్తిస్ ఘడ్ తెలంగాణ సరిహద్దులలోని కర్రేగుట్ట లో కాల్పులను కేంద్రం ప్రభుత్వం నిలిపి వేయాలి మధ్య భారతంలో ఆదివాసుల హననాన్ని ఆపాలి ప్రజాస్వామ్య, రాజ్యాంగం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి...దేశం లో శాంతి యుత వాతావరణం... ఏర్పాటు కు కేంద్రం చర్చలు జరపాలి...విప్లవ పార్టీలు, ప్రభుత్వా ల మధ్య చర్చలు... జరిగితే... అందరికీ ఉపయోగకరం...మావోయిస్టు, కేంద్రం మధ్య జరుగుతున్న పోరాటంలో... ఆదివాసీలు బలి అవుతున్నారు....బ్రిటిష్ కాలం నుంచి మావోయిస్టు పార్టీ ఉన్నది...ఆదివాసి ప్రజలు భయానక వాతావరణం లో ఉన్నారు...స్మశానంలో చర్చలు జరపాలని కేంద్రం అనుకుంటున్నది... పోరాటం చేస్తున్న వారి తో శాంతి చర్చలు జరపాలి...మావోయిస్టు పార్టీ లేఖ లు రాసినప్పటిక్కీ కర్రే గుట్ట ను వేలాది మంది తో ముట్టడించడం సరికాదు... యుద్ధం అపాలని... సమాజ కోరిక మేరకు కేంద్రం ముందుకు రావాలి...

## అంగన్ వాడీలో గ్రాడ్యుయేషన్ డే

కబురు న్యూస్, గోదావరిఖని ఏప్రిల్ 26:
గోదావరిఖని జవహార్ నగర్ సెక్టార్ విఠల్ నగర్ లోని అంగన వాడి కేంద్రంలో ఈసీసీఈ డే సంధర్భంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అలేఖ్య, సూపర్ వైజర్ షీరీన్, ఉపాధ్యాయులు కె.శోభారాణి - జవహర్ నగర్ -5, ఎం.నిర్మల సబ్ సెంటర్ ఏరియా-6, శ్రీలత పరుశురాం నగర్, ఇ.సుజాత - విట్టల్ నగర్ 1-(1), హెల్పర్స్ స్వప్న, తిరుమల, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కాలనీలోని స్థలం కబ్జా చేసిన కబ్జాదారులపై, చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

- బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం.

కబురు న్యూస్, బెల్లంపల్లి ఏప్రిల్ 26 :
బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల గ్రామ శివారులో జాతీయ రహదారి ప్రక్కన జర్నలిస్టుల కాలనీ కోసం కేటాయించిన స్థలంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల ప్లాటింగ్ చేసి, నిర్ణీత కొలతల ప్రకారం ప్లాట్లుగా విభజించి, సిమెంట్ పోల్స్, పాతి కబ్జా చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జర్నలిస్టు కాలనీ స్థలాన్ని సభ్యులతో శనివారం పరిశీలించిన అనంతరం, ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు, కన్నాల గ్రామ శివారు సర్వే నంబర్ 144 నుండి 148 వరకు మరియు 185,186,211, ఉన్న ఐదున్నర ఎకరాల స్థలం పూర్తిస్థాయిలో ప్లాట్లుగా చేయడం, స్థానిక జర్నలిస్టులు ఎవరికి సమాచారం లేకపోవడం విస్మయానికి గురి చేస్తుందని అన్నారు.
ఆ స్థలంలో పట్టణంలో పాత్రికేయ వృత్తిని




కొనసాగిస్తున్న అర్హులైన జర్నలిస్టుల్లో, సీనియార్టీ ప్రాతిపదికన ఉన్నవారితో పాటు అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు సైతం ఆ కాలనీలో, స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించేలా, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ తోపాటు ఆర్డీవో హరికృష్ణ,తాసిల్దార్ జోష్న, లు దృష్టి సారించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థలాన్ని కబ్జా చేసిన విషయమై స్థానిక ఆర్డిఓ హరికృష్ణను ఎమ్మార్వో జోష్నాను, వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.జర్నలిస్టుల కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో,ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ పాండే, ఉపాధ్యక్షులు దండ బోయిన భాస్కర్, కత్తుల నవీన్, శ్రావణ్, సాగర్,రాకేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

## 60 సెల్ ఫోన్లు రికవరీ

కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్ఏప్రిల్ 26 :




సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 60 సెల్ ఫోన్ రికవరి చేసి బాధితులకు అందజేసినట్లు అదనపు పోలీస్ కమిషనర్ (సిఎస్బి)ఎస్.శ్రీనివాస్ రావు తెలిపారు.ఈ మధ్య కాలంలో నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ పరిధిలో సెల్ఫోన్లు పోయిన వారివి రికవరి చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ,ప్రతీఒక్కరు వారి సెల్ ఫోన్లను వాడడంలో అప్రమత్తంగా ఉండాలని,సైబర్ నేరాల పట్లకూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవ్వరైనా వారి సెల్ ఫోన్ పోయినట్లయితే వారు :సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్ను %ఓఓ.ఎవఱతీ.స్త్రశీఙ.ఱఅ% వెబ్సైటులో వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందపర్చాలని,అలా చేసినట్లయితే త్వరగా వారి సెల్ ఫోన్స్ ను రికవరీ చేస్తారని తెలిపారు.ప్రజలు ఈ పద్దతిని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు.ప్రజలు ఎవ్వరుకూడా గుర్తు తెలియని వ్యక్తులకు తమ పాత సెల్ఫోన్లను అమ్మవద్దని సెకండ్ హాండ్ సెల్ఫోన్స్ కొన్నట్లయితే వాటి రసీదును తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు.సెల్ ఫోన్ రికవరిలో కృషిచేసిన మహిళా కానిస్టేబుల్ ఒకటో టౌన్ పీసీ డి.అనుష,ఐటీ సెల్ పీసీ ఆర్.సుష్మా లను పోలీస్ కమీషనర్ అభినందించారు.ఈ కార్యాక్రమంలో ఇంచార్జీ (అడ్మిన్) మస్తాన్ అలీ(ఎ.సి.పి పోలీస్ ట్రెయినింగ్ సెంటర్),ఐ.టి కోర్, ఆర్.ఎస్.ఐ ఎన్.నిషిత్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర ధరలు గ్యాస్ పెంపులకు నిరసనగా మోడీ దిష్టిబొమ్మ దగ్ధం..

**– శ్వేతా ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలి సునీత**

**కబురు న్యూస్,కీసర దమ్మయిగూడ ఏప్రిల్ 26:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ నిత్యవసర ధరల పెంపుపై దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టి కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలను వారు తీవ్రంగా విమర్శించారు శనివారం దమ్మయిగూడ మున్సిపల్ ఆర్ జి కే కాలనీలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్వేతా రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో మహిళ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ నిత్యవసర ల ధరల



పెంపుపై మోడీ ప్రభుత్వం పై నిరసన మోడీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ మహిళా ప్రెసిడెంట్ మొగిలి సునీత రావు మేడ్చల్ జిల్లా మహిళ ప్రెసిడెంట్ రాజోల లక్ష్మి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నిర్మల రెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ దుర్గా జిల్లా జనరల్ సెక్రెటరీ రఫీ బేగం స్టేట్ సెక్రటరీ అనంతలక్ష్మి జిల్లా జనరల్ సెక్రెటరీ రమ్య మరియు మెరుగు సునీత బి బ్లాక్ ఆర్గనైజర్ సెక్రెటరీ మనీషా బి బ్లాక్ సెక్రెటరీ ముంతాజ్ బేగం అరుంధతి మున్సిపల్ ప్రెసిడెంట్ శోభ రాణి వైస్ ప్రెసిడెంట్ సులోచన జనరల్ సెక్రెటరీ మునీశ్వరి మున్సిపల్ ఆర్గనైజర్ సెక్రెటరీ శైలజ కాంగ్రెస్ పార్టీ ముఖ్య భారతి సునీత శ్రావణి నాయకులు మమత సంధ్య కావేరి రుబీనా జయమ్మ అనురాధ రేష్మ భాను లహరి తదితరులు పాల్గొన్నారు

# పారదర్శకత, ప్రతిభ: ప్రభుత్వ నియామకాలకు మూల సూత్రాలు:

**– జలశక్తి శాఖ మంత్రి, రాజ్ భూషణ్**

**కబురు న్యూస్, బాగ్ లింగంపల్లి ఏప్రిల్ 26:** ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ హామీకి అనుగుణంగా 15వ విడత ఉద్యోగ మేళాను ఈ రోజు దేశవ్యాప్తంగా 47 చోట్ల నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ బాగ్ లింగంపల్లిలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ జల శక్తి శాఖ సహాయ మంత్రి డాక్టర్ రాజ్ భూషణ్ చౌధురి ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా ఎంపికైన 130 మంది యువతకు నియామక పత్రాలను అందించారు. యువత సాధికారత, ప్రజాసేవను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనేందుకు ఉద్యోగ మేళా నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇది ఎక్కువగా ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా వికసిత్ భారత్




దార్శనికతను ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం నియామకాలకు సంబంధించిన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. "జాప్యం, పక్షపాతం అనే శకం ముగిసింది. ఎస్ఎస్సీ, ఇతర సంస్థలు ఇప్పుడు నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి వేగంగా పూర్తి చేస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. కొత్తగా నియమితులైన యువత ఆయా శాఖల్లో పనిచేయడమే కాకుండా మార్పుకు ఉత్ప్రేరకాలుగా పనిచేస్తారని అన్నారు. ప్రభుత్వ పరిపాలనలో నూతన సృజనాత్మకతను, శక్తిని తీసుకువస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీమతి మిథాలీ మధుస్మిత (హైదరాబాద్), ఆదాయపు పన్ను (ఇన్వెస్టిగేషన్) డైరెక్టర్ జనరల్ ఆనంద్ బైవార్ (హైదరాబాద్), ఆదాయపు పన్ను ముఖ్య కమిషనర్ ఆదాయ్రశ్రీ సురేష్ బత్తిని తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన యువతకు సంబంధించిన 51,000కు పైగా నియామక పత్రాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించిన ప్రధాని నరేంద్ర మోదీ.. దేశవ్యాప్తంగా జరుగుతోన్న ఉద్యోగ మేళా సభలను ఉద్దేశించి మాట్లాడారు.

# 48 గంటల్లో ఖాళీ చేయండి 29లోపు వెళ్లకపోతే చర్యలు

**– ఢిల్లీ సీఎం రేఖా గుప్తా హెచ్చరిక**

**కబురు న్యూస్, హైదరాబాద్ ఏప్రిల్26** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థానీయుల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో ఖాళీ చేయాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. అయితే మానవతా దృక్పథంతో వైద్య, దౌత్య మరియు దీర్ఘకాలిక వర్గాలకు కొంత మినహా యించింది. తాజాగా వారికి కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 29మంగళవారం వరకు మాత్రమే అన్ని రకాల వీసా చెల్లుబాటు అవుతోందని.. అనంతరం వీసా పని చేయదని.. తక్షణమే అన్ని రకాల వీసాలు రద్దు చేయబడిన కారణాన పాకిస్థానీయులు వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించింది. ఈ



నెల 29 తర్వాత వీసాలు పని చేయవని ఢిల్లీ ప్రభుత్వం కూడా ప్రకటిం చింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక పాకిస్థానీయులకు కొత్త వీసాలు జారీ చేయబడ వని.. దయచేసి అధికారిక నోటిఫికేషన్ చదవాలని ఢిల్లీ ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర నిర్ణయాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా రీట్వీట్ చేశారు. 29లోపు వెళ్లకపోతే అవసరమైన చర్యలు ఉంటాయని రేఖా గుప్తా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే సింధు జలాలు నిలిపివేసింది. అనంతరం వీసాలను రద్దు చేసింది. అలాగే అటారీ–వాఘా సరిహద్దు మూసివేసింది. ఇలా ఒక్కొక్కటిగా కఠిన నిర్ణయాల దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇక సరిహద్దుల్లో ఉగ్రవాదులు ఏరివేతను భారత సైన్యం చేపట్టింది.

# టెక్నాలజీ విద్యలో విద్యార్థులు ముందుండాలి...

**– పీర్జాదిగూడలో ఘనంగా ఉప్పల్ టీచర్స్ వెల్ఫేర్ అస్సోసియేషన్ దశాబ్ది ఉత్సవాలు..**

**– పాల్గొన్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి**

**కబురు న్యూస్, మేడిపల్లి,ఏప్రిల్ 26:** ఉప్పల్ డిపో టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, దశాబ్ది ఉత్సవాలను మేడిపల్లి లోని ఎస్వీఎం గ్రాండ్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉపాధ్యాయ పింగళి శ్రీపాల్ రెడ్డి దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని, దేశభవిష్యత్తు, నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉన్నదని, విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ టీచర్స్ వెల్ఫేర్ అస్సోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వ సభ్య సమావేశం



మరియు దశాబ్ది ఉత్సవాలలో ముఖ్య అతిధులుగా మాజీ మంత్రివర్యులు, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి,ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ విద్యా రంగాన్ని మార్చివేసింది, ఇది ఉపాధ్యాయుల పాత్రను కూడా అభివృద్ధి చేసింది.

విద్యార్థులను భవిష్యత్ శ్రామిక శక్తికి అనుగుణంగా సిద్ధం చేయడానికి, ఉపాధ్యాయులు సాంకేతికతను పాఠ్యాంశాల్లో సమర్థవంతంగా



అనుసంధానించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలి, సాంకేతిక వనరులను ఉపయోగించాలి, మరియు విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపకల్పన చేయడంద్వారా విద్యార్థులు భవిష్యత్తులో విజయవంతమవుతారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తూముకుంట్ల ప్రసన్న లక్ష్మి,దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి యు టి ఎ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఆకుల వనజ, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ కార్పొరేషన్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షునిగా భీమ గాని శ్రీకాంత్



**కబురు న్యూస్, బోడుప్పల్,ఏప్రిల్ 26:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షునిగా భీమ గాని శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి నియామక పత్రాన్ని భీమ గాని శ్రీకాంత్ కు దళిత సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గద్దల రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు.

# సీబీఐ పేరుతో బెదిరింపులు

**– డబ్బు ఇవ్వకుంటే కుమారులను చంపేస్తామని వీడియోకాల్**

**– భయపడి ఆన్ లైన్ ద్వారా నగదును బదిలీ చేసిన బాధితురాలు**



**కబురు న్యూస్, కోనసీమ జిల్లా ఏప్రిల్ 26:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సైబర్ నేరగాళ్లు ఘరానా మోసానికి పాల్పడ్డారు. కొత్తపేటలో ఓ విశ్రాంత ఉద్యోగినిని బెదిరించి ఆమె నుంచి భారీ మొత్తంలో డబ్బు కాజేశారు. బాధితురాలు రూ.30 లక్షల నగదును బ్యాంకులో జమ చేయడాన్ని కేటుగాళ్లు గమనించారు. ఆ తర్వాత ఆమె వివరాలు తీసుకొని సీబీఐ అధికారులమంటూ ఫోన్ చేశారు. డబ్బు ఇవ్వకుంటే కుమారులను చంపేస్తామని వీడియోకాల్ చేసి బెదిరించారు. దీంతో భయపడిన ఆమె ఆన్‌లైన్ ద్వారా నగదును బదిలీ చేశారు. ఆ తర్వాత అది మోసమని గ్రహించిన బాధితురాలు కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చెల్లి అని పిలిచి పక్కింటి వివాహితపై అత్యాచారయత్నం

**కబురు న్యూస్, సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఏప్రిల్ 26:** చెల్లి అని పిలిచి పక్కింటి వివాహితపై అత్యాచారయత్నం ప్రతిఘటించడంతో కొడవలితో నరికి వివాహితను హత్య.. భయంతో తానూ ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో రేఖ అనే వివాహితను నరికి చంపి, ఆత్మహత్య చేసుకున్న ఉల్లి శ్రీకాంత్ రేఖ ఒంటిపై పంటి గాట్లు రేఖ భర్త ఉద్యోగ నిమిత్తం దుబాయ్ లో ఉండగా.. ఇంటి పక్కనే ఉండే శ్రీకాంత్ ఇంట్లోకి వెళ్లిన రేఖ శ్రీకాంత్ భార్య పుట్టింటికి వెళ్లడంతో, రేఖపై అఘాయిత్యానికి పాల్పడిన శ్రీకాంత్ చెల్లి అని పిలిచే శ్రీకాంత్ ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడడంతో గ్రామంలో ఉద్రిక్తత పోస్ట్ మార్టం నిమిత్తం రెండు మృతదేహాలను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు




# పాకిస్తాన్ వాళ్ల కోసం వెతుకుతుంటే.. బయటపడ్డ 400 మంది బంగ్లాదేశీయులు.



**కబురు న్యూస్, న్యూ ఢిల్లీ ఏప్రిల్ 26:** పహల్గామ్ ఉగ్ర దాడి అనంతరం భారత ప్రభుత్వం పలు సంచలన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాకిస్తాన్ పౌరులను దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల హోమ్ శాఖలతో పాటు డీజీపీలకు.. అక్రమంగా భారత్ లో ఉంటున్న పాకిస్తాన్ పౌరులను గుర్తించి.. వెనక్కి పంపించాలని ఆదేశాలు అందాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు పాకిస్తానియులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో గుజరాత్ రాష్ట్రంలో ఊహించిన పరిణామం ఎదురైంది. ఈ రోజు ఉదయం 3 గంటల నుంచి అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్, %బూ+, జూఔ%, జోన్ 6, ప్రధాన కార్యాలయాల బృందాలతో కలిసి, అహ్మదాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ వలసదారులను పట్టుకోవడానికి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించింది. పాకిస్తాన్ పౌరుల కోసం నిర్వహించిన ఈ ఆపరేషన్ సమయంలో, 400 మందికి పైగా అనుమానాస్పద వలసదారులు బయటపడ్డారు. వీరంతా.. రాష్ట్రంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భారత పౌరులుగా కొనసాగేందుకు ప్రయత్నించారు. తాజా తనిఖీల్లో వారి బండారం బయటపడినట్లు అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ అజిత్ రాజియన్ తెలిపారు. వారిలో అత్యధికంగా బంగ్లాదేశ్ పౌరులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే మిగిలిన వారి వద్ద ఎటువంటి డాక్యుమెంట్స్ లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర నిర్ణయంతో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో పాకిస్తానీయుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

# దేనికైనా సిద్ధం..' ఇండియన్ ఆర్మీ పోస్ట్



**కబురు న్యూస్, న్యూఢిల్లీ ఏప్రిల్ 26:** పాకిస్థాన్తో ఏ క్షణమైనా యుద్ధం జరగొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్న తరుణంలో ఇండియన్ ఆర్మీ కీలక పోస్ట్ చేసింది. ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం అంటూ.. జవాన్ల విన్యాస దృశ్యాలను షేర్ చేసింది. 'దేనికీ భయపడం, ఏదీ మమ్మల్ని ఆపలేదు, ఏ భూభాగం మాకు దూరం, క్లిష్టమైంది కాదు, ఎప్పుడూ సిద్ధమే' అని పేర్కొంది. ఇప్పటికే నేవీ కూడా సిద్ధంగా ఉన్నామని పోస్ట్ చేసింది.

# గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు మరో ప్రతిష్టాత్మకమైన అవార్డు

**కబురు న్యూస్, నిజామాబాద్ ఏప్రిల్ 26:** ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా హైయర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను స్వయం ప్రతిపత్తి హోదా గల గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ప్రమాణాలతో తెలంగాణ రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామ్ మోహన్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో ఈ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత కలిగిన ఈ గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ప్రమాణాలతో 5వ స్థానంలో నిలిచి, ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డా. రామ్ మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, పరీక్షల నియంత్రణ అధికారి భరత్ రాజ్, అకడమిక్ కో-





ఆర్డినేటర్ ఐ. గంగాధర్, పి.ఆర్.ఓ. డా.దండుస్వామి, ఎన్.సి.సి. అధికారి లెఫ్టినెంట్ డా. రామస్వామి, వివిధ విభాగాల అధిపతులు వినయ్ కుమార్, డా.రంజిత, డా. ఉమాకిరణ్, డా రామకృష్ణ, డా.రమేష్ గౌడ్, బాలమణి, పూర్ణ చందర్ రావు, అధ్యాపకులు, మరియు ఏ.ఓ. జగన్, సూపరింటెండెంట్




ఉదయభాస్కర్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, నిజామాబాద్ పట్టణ ప్రముఖులు, ప్రజలు, సంతోషం వ్యక్తం చేశారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**- బిఆర్ఎస్యూత్ అధ్యక్షుడు గుండేపల్లి భీమ్ రెడ్డి**



**కబురు న్యూస్, దౌల్తాబాద్ ఏప్రిల్ 26 :** దౌల్తాబాద్ మండల కేంద్రం నుండి భారీగా సభకు తరలి రావాలని బిఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీని కేసీఆర్ స్థాపించి 25 సంవత్సరాల క్రితం పోరాటం ప్రారంభిం చారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు అంచుల వరకు వెళ్లి వచ్చారని, ఇది యువతకు ఎంతో మార్గదర్శకమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక తెలంగా ణను సాధించిన కేసీఆర్‌ను ప్రజలందరూ తమ గుండెల్లో పదిలపరుచుకున్నారని అన్నారు.వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజలు తమ సత్తాను చాటుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 వాగ్దానాలు చేసిందని, ఇందులో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తప్ప మిగతా హామీలను తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీల రాజకీయాలను గుర్తించిన తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ తెలంగాణ పగ్గాలను పట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు వారి నుంచి వస్తున్న స్పందనను బట్టి గుర్తించామని అన్నారు.వచ్చే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి తథ్యమని అన్నారు. ఛలో వరంగల్ సభకు కార్యకర్తలు, నాయకులు తరలి రావడానికి ఉత్సాహంగా ఉన్నారని అన్నారు.

# మృతుల కుటుంబాలకు ఘన నివాళులు

**కబురు న్యూస్, మెట్ పల్లి ఏప్రిల్ 26 :** శనివారం పట్టణంలోని టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు గారి నివాసములో కాశ్మీర్ పహల్ గావ్ లో భారతీయ పౌరులపై ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబాలకు ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో ప్రజలపై ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మతోన్మాదులు పర్యాటకులను కాల్చి చంపడం హేయమైన చర్య అని అన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశంపై సంఘీభావం ప్రకటించడం పట్ల భారతదేశం శాంతి యుత వాతావరణంలో ప్రజలను. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించి మరొక సారి ఇలాంటి దాడులు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతిచెందిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ



మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా, కాంగ్రెస్ పార్టీ ఫిషర్మేర్ స్టేట్ జనరల్ సెక్రెటరీ రుత్త నారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ అందె మారుతి బాపూజీ, ఇబ్రహీపట్నం యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ నల్లూరి సాగర్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జాఫర్, బైండ్ల శ్రీకాంత్, మామిడి రాజశేఖర్ రెడ్డి, ఇప్పపల్లి గణేష్ గౌడ్,తోగిటి నాగరాజ్, మొగలి రాజేందర్,కోరే రాజ్ కుమార్, చౌదరి తదిరితలు పాల్గొన్నారు

# వృద్ధురాలి కంట్లో కారం చల్లి బంగారం చోరీకి యత్నం

**- కేకలు వేయడంతో నేరస్తులను పట్టుకున్న స్థానికులు**



**కబురు న్యూస్, నిజామాబాద్ ఏప్రిల్ 26:** నవీపేట్ బస్టాండ్ లో వృద్ధురాలి కంట్లో కారం చల్లి, కత్తితో బెదిరించి ముగ్గురు చోరీకి పాల్పడ్డారు. నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మోపాల్ మండలం కంజర్ గ్రామానికి చెందిన కాలూర్ లత, పంతుల విజయ, ఈర్ల సాయికుమార్ లు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరు సులబమార్గంలో డబ్బులు వచ్చే మార్గాలు ఆలోచిస్తున్నారు. దొంగతనమే సరైన మార్గమని నిర్ణయించుకుని ఈ నెల 24వ తేదిన కల్లు సేవిస్తూ ఫోన్లో దొంగతనం ఎలా చేయాలని చూస్తుండగా షేర్ చాట్ లో ఒక వీడియో చూసి ఒక మహిళ మెడలో నుంచి కత్తితో భయపెట్టి ఆమె కళ్ళలో కారం చల్లి బంగారం దొంగతనం చేసినట్లు చూశారు. ఆ వీడియో చూసిన తర్వాత ముగ్గురు ఒక ఆలోచనకు వచ్చి దొంగతనం చేయాలని నిర్ణయించుకుని ఈ నెల 25న శుక్రవారం నవీపేట్ లో మార్కెట్ ఉండంతో బస్టాండ్ లో అవకాశం కోసం నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో నవీపేట నారాయణపూర్ గ్రామానికి చెందిన కిష్టాబాయి తన గ్రామానికి వెళ్లేందుకు నవీపేట బస్టాండ్ కు వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మూత్రశాలల వైపు వెళ్లగా ఓ మహిళ ఆమె వెనుకాలే వెళ్లి వృద్ధురాలి కంట్లో కారంచల్లి కత్తితో బెదిరించి నగలు లాక్కుంది. ఈ క్రమంలో వృద్ధురాలు కేకలు పెట్టడంతో మహిళ పారిపోయేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న వారు గమనించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. వారి వద్ద ఉన్న 10 గ్రాముల బంగారపు గుండ్లు, నేరస్తుల వద్ద ఉన్న కత్తితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నవీపేట్ ఎస్సై, ఐడి పార్టీ సిబ్బందిని సిఐ అభినందించారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సంబరాలకు ఇది సమయం కాదు

**- పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రోళ్ల నర్సక్క**

**కబురు న్యూస్, మెట్ పల్లి ఏప్రిల్ 26 :**



నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లు.... జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గామ్ లో జరిగిన అమానవీయ సంఘటనను జాతి యావత్తు ముక్తకంఠంతో ఖండిస్తూ, మృతుల ఆత్మ శాంతి కొరకు దేశం నివాళు లర్పిస్తుండగా.. మరో దిక్కు తెలంగాణలో బి ఆర్ ఎస్ పార్టీ వరంగల్లో 27న జరప తలపెట్టిన పార్టీ ఆవిర్భావ సభను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రికలు పంచుకోవడం విడ్డూరంగా ఉందని పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి ఎర్రోళ్ల నర్సు హనుమండ్ల యాదవ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె శనివారం మెట్పల్లిలోని ఆమె నివాసంలో మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా తెలంగాణను ఏలిన టిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వనరులతో నిండుగా ఉన్న తెలంగాణను నిలువున దోచి దివాలా తీశారని మండిపడ్డారు. దశాబ్ద ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అప్పటి ప్రభుత్వం.. దోచిన డబ్బుతోనే ప్రస్తుతం హనుమకొండలో పార్టీ ఆవిర్భావ వేడుకల సంబరాలను నిర్వహిస్తుందని అన్నారు. పెహల్గాం ఊచకోత సంఘటనతో ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రస్తుత తరుణంలో బి ఆర్ ఎస్ పార్టీ వేడుకల పేరిట ఇలాంటి చౌకబారు సంబరాలు జరుపుకోవడం ప్రజలు హర్షించరని, మీకు అంతగా అత్యుత్సాహం ఉంటే మీ పార్టీ రజతోత్సవ ఆవిర్భావ వేడుకలను పాకిస్తాన్ బోర్డర్లో జరుపుకోవచ్చని హితవు పలికారు.

# భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు

**- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్**

**కబురు న్యూస్, దౌల్తాబాద్ ఏప్రిల్ 26 :** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలకేంద్రంలో కలెక్టర్ ప్రతిక్ జైన్ భూభారతి చట్టం 2015 పై అవగాహన కల్పించారు.ఈ చట్టం ద్వారా భూ వివాదాలకు అస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలో భూ కమతానికి భూదర్ నంబర్ కేటాయించి వాటికీ శాశ్వత పరిష్కారం చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ చట్టంలో క్షేత్ర స్థాయి వాస్తవాల ఆధారంగా సదా బైనామాలను (నమోదుకాని అమ్మకపు ఒప్పందాలు) క్రమబద్ధీకరించడానికి నిబంధనలు ఉన్నాయి . ఇది భూమిపై అనధికారిక లేదా సాంప్రదాయ వాదనలు ఉన్న వేలాది మందికి చట్టబద్ధమైన యాజమాన్య హక్కులను పొందడానికి సహాయపడుతుంది .ఏదైనా భూమి రిజిస్ట్రేషన్ లేదా మ్యుటేషన్‌కు ముందు, సమగ్ర సర్వేలు మరియు డిజిటల్ మ్యాపింగ్ నిర్వహించడం ఈ చట్టం తప్పనిసరి చేస్తుంది . ఈ చర్య భూమి సరిహద్దులలో అస్పష్టతలను తొలగించడం మరియు భవిష్యత్తులో వ్యాజ్యాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది.భూమి రికార్డులలోని తప్పుడు యాజమాన్య నమోదులు, సరిపోలని సర్వే నంబర్లు మరియు తప్పుడు భూమి వర్గీకరణ వంటి వాస్తవ దోషాలను సరిదిద్దడానికి ఈ




చట్టం అనుమతిస్తుంది . ఈ దిద్దుబాట్లు ఇప్పుడు మండల మరియు జిల్లా స్థాయి లో నిర్వహించబడుతున్నాయి , వేగవంతమైన మరియు మరింత స్థానికీకరించిన పరిష్కారాలను అందిస్తున్నాయి.భూ సమస్యలు ధరణిలో పరిష్కారం లేదు కానీ ఈ చట్టం లో అన్ని సమస్యలకు పరిష్కారం ఉందని ప్రతి రైతు తమ సమస్య నమోదు చేసుకోవాలి అని కలెక్టర్ సూచించారు. భూ భారతి పొర్టర్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. సమస్యలు 60 రోజుల వ్యవది లో పరిష్కారం చూపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో కలెక్టర్ ప్రతిక్ జైన్, అదనపు కలెక్టర్ లింగనాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ఆఫిసర్ వెంకట్ రెడ్డి,యమ్మార్వో

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి



**కబురు న్యూస్, నారాయణపేట ఏప్రిల్ 26 :** ఉమ్మడి కొడంగల్ నియోజకవర్గం వారిగా అన్ని మండల కేంద్రాలనుండి భారీగా సభకు తరలి రావాలని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మాజీ కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి శాశం రామకృష్ణ కార్యకర్తలకు సూచించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం టి ఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి ఇరవై ఐదు సంవత్సరాల క్రితం పోరాటం ప్రారంభించారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి చావు అంచుల వరకు వెళ్లి వచ్చారని,అందుకే కెసిఆర్ ను తెలంగాణ బాపు అంటారని, ఇదిచిన్నారులకు యువతకు ఎంతో మార్గదర్శకమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తో తాడో పేడో తేల్చుకోవాలని, కెసిఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అని నిరాహార ధీక్ష చేసి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను ప్రజలందరూ తమ గుండెల్లో పదిలపరుచుకు న్నారని అన్నారు.వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజలు తమ సత్తాను చాటుతారని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తప్ప, మిగతా హామీలను కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను గుర్తించిన తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ తెలంగాణ పగ్గాలను చేపట్టాలని తెలంగాణ యువత మహిళ కర్షక కార్మిక లోకం ఆకాంక్షిస్తు న్నారని తెలిపారు.వచ్చే సర్పంచ్ మరియు ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి తథ్యమని టిఆర్ఎస్ గెలుపు ఖాయమని ఛలో వరంగల్ సభకు కార్యకర్తలు, నాయకులు మహిళలు ఉద్యోగులు నిరుద్యోగులు తరలి రావడానికి ఉత్సాహంగా ఉన్నారని అన్నారు.

# సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా




**- వాస్తవాలను తెలుసుకోకుండా పోస్టులను ఫార్వర్డ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**

**- జగిత్యాల డీఎస్పీ రఘు చందర్**

**కబురు న్యూస్, జగిత్యాల ఏప్రిల్ 26 :** సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిఎస్పీ రఘు చందర్ గారు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజ నిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో అట్టి మెసేజ్లను ఫార్వర్డ్ చేయకూడదని సోషల్ మీడియా పై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ప్రతి పోస్టు ను నిశితంగా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. కొందరు ఇతర దేశాలలో ఉంటూ సోషల్ మీడియాలో ఏం చేసినా తమకేం కాదన్న ధీమాతో సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెడుతున్నారని.. అలాంటి వారిపైనా కేసులు నమోదు చేసి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి పాస్ పోర్టులు, వీసాలను కూడా రద్దు చేయించొచ్చని చెప్పారు. ఇప్పటికే ఇలాంటి పోస్టులను వాట్సాప్ మరియు ఫేస్బుక్ ల ద్వారా చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. కావున సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టుల పై ఎలాంటి అనుమానలు , సందేహాలు ఉన్న జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని ప్రజా భద్రత ,లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ప్రజలు శాంతి యుత జీవనం గడిపేల చూడడం జగిత్యాల జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం అన్నారు.



## అద్భుతం జరిగితేనే అవకాశం: ప్లే ఆఫ్స్ రేస్‌లోనే చెన్నై, రాజస్థాన్.. టాప్-4 లోకి రావాలంటే ఇలా జరగాలి!

ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. 99 శాతం వీరు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించడం అసాధ్యం. అయితే ఏదో చిన్న మూల వీరి ఆశలు చిగురించే ఉన్నాయి. ఇప్పటివరకు ఈ టోర్నీలో చెన్నై, రాజస్థాన్ జట్లు రెండు కూడా ఆడిన 9 మ్యాచ్ ల్లో రెండే విజయాలు సాధించాయి. మిగిలిన 5 మ్యాచ్ లు గెలిచినా వీరి ఖాతాలో 14 పాయింట్లు ఉంటాయి. ఐపీఎల్ లో ఒక జట్టు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించాలంటే కనీసం 16 పాయింట్లు ఉండాలి. అంటే 14 మ్యాచ్ ల్లో 8 మ్యాచ్ లు గెలిస్తే దర్జాగా ప్లే ఆఫ్స్ కు వెళ్తాయి.చాలా కొన్ని సందర్భాల్లో 8 మ్యాచ్ లు గెలిచినా టోర్నీ నుంచి నిష్క్రమించే అవకాశాలు ఉన్నాయి. మరో సందర్భంలో 7 మ్యాచ్ లు గెలిచినా ఇతర మ్యాచ్ ల ఫలితాల ఆధారంగా ప్లే ఆఫ్స్ కు చేరొచ్చు. గత సీజన్ లో రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆడిన 14 మ్యాచ్ ల్లో 7 గెలిచి ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. ఇతర మ్యాచ్ ల ఫలితాలు ఆర్సీబీ కలిసి రావడం విశేషం. ఈ సారి కూడా చెన్నై, రాజస్థాన్ జట్లు టాప్ 4 లో ఉండడానికి ఒక చిన్న అవకాశం ఉంది. అయితే ఇలా జరగాలంటే అద్భుతం జరగాలి.చెన్నై, రాజస్థాన్ తాము ఆడబోయే చివరి 5 మ్యాచ్ ల్లో భారీ తేడాతో గెలవాలి. అదే సమయంలో ప్రస్తుతం పాయింట్స్ టేబుల్ లో టాప్-3లో ఉన్న గుజరాత్ టైటాన్స్(12), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(12), ఢిల్లీ క్యాపిటల్స్(12) జట్లు మిగిలిన మ్యాచ్ ల్లో విజయం సాధించాలి. మరోవైపు ముంబై ఇండియన్స్(10), లక్నో సూపర్ జయింట్స్ (10), పంజాబ్ కింగ్స్(10) 7 మ్యాచ్ ల కంటే ఎక్కువ గెలవకూడదు. ఇలా జరిగితే చెన్నై, రాజస్థాన్ జట్లు నాలుగో స్థానం కోసం ప్లే ఆఫ్స్ రేస్ లో ఉండొచ్చు. చెన్నై, రాజస్థాన్ రెండు జట్లు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించడం కుదరదు. మే 12 న ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

# గతేడాది ఆర్సీబీ చేసింది..

## ఆ స్ఫూర్తితో ఈసారి మేం సాధిస్తాం





**కబురు క్రీడలు ఏప్రిల్ 26:** ఐపీఎల్ 2025 సీజన్‌లో చెపాక్ వేదికగా తొలిసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదు వికెట్ల తేడాతో మట్టికరిపించింది. దీంతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తొమ్మిది మ్యాచుల్లో మూడు విజయాలనే నమోదు చేసిన సన్‌రైజర్స్.. మిగతా ఐదు మ్యాచుల్లో అన్నీ గెలిస్తేనే నాకౌట్‌కు చేరుతుంది. ఈ విషయంలో తమకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టే స్ఫూర్తి అని ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించాడు. "చెన్నైపై విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఇకనుంచి మేం ఒక్కో మ్యాచ్ ఫలితం గురించి ఆలోచిస్తాం. ఇప్పుడు గెలిచాం. మిగిలిన వాటిల్లోనూ విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం. కమిందుతో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించడం బాగుంది. భారీ షాట్లకు పోకుండా తేలికగా మ్యాచ్‌ను ముగించాలని మాట్లాడుకున్నాం. నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బౌలింగ్ బాగా చేస్తున్నారు. చివరికి మేం విజయం సాధించాం. మాకు డూ ఆర్ డై లాంటి పోరు. గతేడాది ఇదే పరిస్థితుల్లో ఆర్సీబీ ఉంది. వరుసగా మ్యాచులు గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. ఈ సంవత్సరం మేం ఎందుకు సాధించకూడదు? వందశాతం ప్రదర్శన ఇస్తే మిగతా మ్యాచుల్లో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి" అని నితీశ్ వెల్లడించాడు.

# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు

**కబురు క్రీడలు ఏప్రిల్ 26:**
ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్‌కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.



### ధోనీకి అలా బంతులేస్తే బాదేస్తాడు: హర్షల్ పటేల్

"కాశీ సర్‌కు అడ్మినిస్ట్రేషన్‌కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్‌కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్‌ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్‌లోని సభ్యులే ఆక్షన్‌లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్‌మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం" అని రైనా వ్యాఖ్యానించాడు.

### ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్

"ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్‌లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్‌లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్‌లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది" అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

### ఇక ట్రయల్ రన్‌లా..: రాయుడు

"ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్‌రన్‌లా సీఎస్కే జట్టును చూడొచ్చు" అని అంబటిరాయుడు వ్యాఖ్యానించాడు.


## వారికంటే ఐపీఎల్‌లో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ భత్యమే ఎక్కువ: సునీల్ గావస్కర్



**కబురు క్రీడలు ఏప్రిల్ 26:** భారత జట్టుకు ఎంపిక కావాలంటే ఇప్పుడు సులువైన మార్గం ఐపీఎల్ . ఒకప్పుడు దేశవాళీ క్రికెట్‌లో మంచి ఆటతీరు కనబరిస్తే ఠక్కున అవకాశాలు వచ్చేవి. ఇప్పుడైతే ఐపీఎల్‌లో నిలకడగా ఆడుతున్నాడా? లేదా? అనేది మేనేజ్‌మెంట్ చూస్తుందనడంలో సందేహం లేదు. అలాగని రంజీల్లో ఆడేవారికి విలువ లేదా? అంటే ఉంది కానీ ఐపీఎల్‌తో పోలిస్తే అవకాశాలపరంగానే కాకుండా జీతభత్యాల్లోనూ వ్యత్యాసం ఉందనేది మాజీ క్రికెటర్ల అభిప్రాయం. ఈ అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తన విశ్లేషణను వెల్లడించాడు."పెద్దగా పరిచయం లేని క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడినా చాలు గొప్ప గౌరవం అందుకొంటాడు. అదే జాతీయ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీలో ఎంత రాణించినా కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. ఐపీఎల్‌లో అలా కాదు. ఇప్పటికే ఎన్నో సందర్భాలను మనం చూశాం. సీజన్‌లో ఒకటి లేదా రెండు మ్యాచుల్లో దూకుడుగా ఆడితే అతడి పేరు మారుమోగిపోతుంది. కెరీర్ మొత్తం రంజీ ట్రోఫీ ఆడినా అది సాధ్యం కాదు. ఐపీఎల్‌కున్న భారీ ఆదరణే దీనికి కారణం. బ్రాడ్‌కాస్ట్‌పరంగానూ స్పాన్సర్‌షిప్ హక్కులు రూ.కోట్లలో ఉంటాయి. ఐపీఎల్ కంటే ఎక్కువగా దేశవాళీలో ఆడే వారికి ఇది పెద్దగా రుచించని వాస్తవం. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ సీజన్‌లు అన్నీ కలిపి ఆడినా.. ఐపీఎల్‌లో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌కు వచ్చే కనీస మొత్తం రూ.30 లక్షలకు దరిదాపుల్లో ఉండదు. ఈ అసమానతను తగ్గించాల్సిన అవసరం బీసీసీఐతోపాటు అన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులపై ఉంది. ఇప్పటికే ముంబయి తమ రంజీ ప్లేయర్లకు బీసీసీఐతో సమానంగా చెల్లింపులు చేస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు.ప్రస్తుతం స్టార్లుగా మారిన బుమ్రా, హార్దిక్, సిరాజ్, యశస్వి, కేఎల్ రాహుల్, చాహల్.. ఇలా చాలామంది జాతీయజట్టుకు ఎంపికైనవారే. తాజాగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ రూ.1.1 కోట్ల ప్యాకేజీని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

## పాక్‌తో క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ





**కబురు క్రీడలు ఏప్రిల్ 26:** 2008 తర్వాత పాకిస్థాన్‌కు టీమ్‌ఇండియా వెళ్లని సంగతి తెలిసిందే. చివరిసారిగా 2012 - 13లో భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అప్పట్నుంచి కేవలం తటస్థ వేదికల్లోనే తలపడుతూ వస్తున్నాయి. ఇప్పుడు పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడొద్దనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలకు భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ మద్దతు తెలిపాడు. ఇక నుంచి పాక్‌తో ఎలాంటి క్రికెట్ ఆడొద్దని బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు."వందశాతం అంగీకరిస్తా. పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలి. అది జరిగి తీరాలి. తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉండటం తమాషా కాదు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదు" అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

### ఉగ్రదాడిపై స్పందించని పాక్ క్రికెటర్లు

కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై ప్రపంచవ్యాప్తంగా స్పందనలు వస్తుంటే.. డానిష్ కనేరియా మినహా పాకిస్థాన్ క్రికెటర్లు ఎవరూ స్పందించలేదు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా మాత్రం భారత్‌పై అవాకులు చవాకులు పేలిన సంగతి తెలిసిందే. టోర్నీనే బహిష్కరించాలంటూ పెద్ద మాటలే చెప్పారు. ఇప్పుడు మాత్రం కనీసం ఖండిస్తూ ఒక్క ప్రకటన చేయలేదు. ఆ దేశ ప్రభుత్వంలా 'తమకేమీ సంబంధం' లేనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

## ఇంకా అందుకే ఆడుతున్నా

**కబురు క్రీడలు ఏప్రిల్ 26:**



పాత తరం ప్రతినిధిగా తాను ఇంకా బరిలో ఉన్నానని.. టెన్నిస్ మ్యాచ్‌ల కోసం అభిమానులను కోర్టులకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నానని సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్ అన్నాడు. మాడ్రిడ్ ఓపెన్లో ఆడుతున్న 37 ఏళ్ల నొవాక్ ఇలా వ్యాఖ్యానించాడు. "రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ ఇంకా ఆడట్లేదనే వాస్తవాన్ని అంగీకరించడానికి అభిమానులకు సమయం పడుతుంది. పాత తరం పోయి కొత్త తరం వచ్చినా.. అభిమానులను టెన్నిస్ ఆకర్షించగలగాలి. పాత తరం ప్రతినిధిగా నావంతుగా అభిమానులను కోర్టులకు రప్పించడానికి ప్రయత్నం చేస్తున్నా. ఇంకా అందుకే ఆటలో కొనసాగుతున్నా" అని నొవాక్ తెలిపాడు. గ్రాండ్‌స్లామ్స్‌తో పాటు ఇండియన్‌వెల్స్ లాంటి కొన్ని టోర్నమెంట్లకు ఇప్పటికీ పెద్ద స్థాయిలో అభిమానులు నేరుగా చూడటానికి రావడం సంతోషించాల్సిన విషయమని అన్నాడు. "దిగ్గజాలు, పెద్ద స్టార్లు ఆడుతున్నారా లేదా అని చూడకుండా దాదాపు పెద్ద టోర్నీలన్నింటికీ అభిమానులు కోర్టులకు తరలి రావడం చాలా సంతోషంగా ఉంది" అని జకో అన్నాడు.

# అలా చీప్ కామెంట్స్ ఎలా చేస్తారు

## సోషల్ మీడియా తీరుపై శేఖర్ మాస్టర్ ఆగ్రహం



కబురు సినిమా ఏప్రిల్ 26:
ఓ మహిళా డ్యాన్సర్ విషయంలో సోషల్‌మీడియాలో వచ్చే కామెంట్స్ తనని ఎంతో బాధించాయని ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ తెలిపారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఇలాంటి కామెంట్స్ ఎలా చేస్తుంటారని ప్రశ్నించారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన పలు కాంట్రవర్సీల గురించి మాట్లాడారు. ఇలాంటివన్నీ చీప్‌గా అనిపిస్తున్నాయన్నారు. పలు టీవీ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించడం సరదాగా అనిపిస్తుందని.. ఎలాంటి టెన్షన్స్ ఉండవని ఆయన వెల్లడించారు. కొరియోగ్రాఫర్‌గా వర్క్ విషయంలో కాస్త ఒత్తిడి ఉంటుంది. కానీ, టీవీ కార్యక్రమాలకు వచ్చేసరికి అలా ఏమీ ఉండదు. జడ్జ్‌గా వ్యవహరించడం రిలాక్స్‌గా అనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ డ్యాన్స్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా డ్యాన్సర్ విషయంలో చాలా విమర్శలు ఎదురయ్యాయి. నిజం చెప్పాలంటే, ఆ సీజన్‌లో పాల్గొన్న మిగిలినవారితో పోలిస్తే ఆమె బాగా డ్యాన్స్ చేస్తుందనిపించింది. అందుకే ఆమెను మెచ్చుకున్నా. దానిని కొంతమంది తప్పుగా అర్థం చేసుకున్నారు. టాలెంట్ ఉన్న వాళ్లను ప్రోత్సహించకూడదా? నా వల్లే ఆమె విజేత అయిందన్నారు. మా గురించి ఇష్టం వచ్చిన కామెంట్స్ చేశారు. సోషల్‌మీడియాలో నా పోస్టులకు ఆమె గురించి కామెంట్స్ పెట్టేవారు. ఆ సమయంలో నేను ఎంతో బాధపడ్డా. ఆ షో తర్వాత ఆమె ఎవరో కూడా నాకు తెలియదని ఆయన వెల్లడించారు. ఇండస్ట్రీలో ఒక ప్రముఖ కొరియోగ్రాఫర్‌తో తనకు పడదని వచ్చిన వార్తలపై మాట్లాడుతూ.. అందులో నిజం లేదన్నారు. అందరితోనూ తనకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. మేమంతా మంచిగానే ఉంటాం. కలిసినప్పుడు మాట్లాడుకుంటాం. మేము సరదాగా మాట్లాడుకుంటున్న ఫొటోలు కూడా చాలా సందర్భాల్లో బయటకు వచ్చాయి. కాకపోతే, బయటవాళ్లు మాత్రం మా మధ్య ఏవో గొడవలు ఉన్నట్లు- మాట్లాడుకుంటున్నారంతే' అని శేఖర్ మాస్టర్ స్పష్టతనిచ్చారు.

# బన్నీకి రౌడీబ్రాండ్ గిఫ్టులు

## థాంక్యూ మైడియర్ అంటూ అల్లు అర్జున్ రిప్లై



కబురు సినిమా ఏప్రిల్ 26:
అల్లు అర్జున్, విజయ్ దేవరకొండల మధ్య మంచి బాండింగ్ ఉన్న సంగతి తెలిసిందే! ఫ్యాన్స్‌లో ఇద్దరికీ మంచి క్రేజ్ కూడా ఉంది. సమయం కుదిరిన ప్రతిసారీ ఒకరిపై ఒకరు అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు. తాజాగా అల్లు అర్జున్‌కు విజయ్ దేవరకొండ ఓ గిఫ్ట్ అందించారు. జయ్ దేవరకొండ రౌడీ బ్రాండ్ స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా బన్నీకి రౌడీ బ్రాండ్ డ్రెస్‌లను, పిల్లల కోసం కొన్ని బర్గర్‌లను పంపారు. దీనికి సంబంధించిన ఫొటోను పంచుకున్న బన్నీ 'మై స్వీట్ బ్రదర్.. ఎప్పుడూ నువ్వు సర్‌ప్రైజ్ చేస్తుంటావు. సో స్వీట్' అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. ఇంతకుముందు కూడా అల్‌ల్లు అర్జున్‌కు విజయ్ గిఫ్టులు పంపిన విషయం తెలిసిందే. 'పుష్ప 2' రిలీజ్ సందర్భంగా 'పుష్ప' పేరుతో ఉన్న టీ- షర్ట్‌లను పంపారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'నా స్వీట్ బ్రదర్.. నీ ప్రేమకు కృతజ్ఞతలు' అని బన్నీ పేర్కొన్నారు. 'లవ్ యూ అన్నా.. మన సంప్రదాయాలు కొనసాగుతాయని విజయ్ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం బన్నీ అట్లీ దర్శకత్వంలో ఓ భారీ సినిమా చేస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీని తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా ఉంది. విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'లో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు.





# అల్లు అర్జున్ సరసన మృణాల్?

కబురు సినిమా ఏప్రిల్ 26:
కథానాయకుడు అల్లు అర్జున్ త్వరలో తన కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆయన నటిస్తున్న ఈ 22వ సినిమాకి అట్లీ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఇందులో కథ రీత్యా ముగ్గురు కథానాయికలు కనిపించనున్నట్లు తెలుస్తోంది. కాగా, అందులో ఓ పాత్ర కోసం మృణాల్ ఠాకూర్‌ను రంగంలోకి దించనున్నారని సమాచారం. ఇప్పటికే ఆమెతో కథా చర్చలు పూర్తయ్యాయని.. ఇటీవలే తను లుక్ టెస్ట్‌లోనూ పాల్గొందని తెలుస్తోంది. మరోవైపు మిగిలిన రెండు నాయికా పాత్రల కోసం జాన్వీ కపూర్, దీపికా పదుకొణె పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే జాన్వీతో చర్చలు పూర్తయ్యాయని.. దీపికతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యమున్న కథతో రూపొందుతున్న చిత్రమిది. సమాంతర ప్రపంచం, పునర్జన్మ కాన్సెప్ట్ ఈ కథలో మిళితమై ఉండనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇది ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.






# త్వరలోనే రాజాసాబ్ టీజర్ విడుదల

## సన్నాహాల్లో మూవీ బృందం

ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా రాజాసాబ్. షూటింగ్ స్టార్ట్ చేసి చాలాకాలం అవుతున్నా ఈ సినిమా ఇంకా అలానే సాగుతూ.. ఉంది. అదిరిపోయే పాటలు, ఫైట్స్, కామెడీ, డ్యాన్స్‌తో పాటు ముగ్గురు హీరోయిన్లతో రొమాన్స్ చేస్తున్నాడు డార్లింగ్. పైగా ఫస్ట్ హార్రర్ రొమాంటిక్ కామెడీ మూవీ రాజాసాబ్. ఇన్ని విశేషాలు ఉన్న ఈ సినిమా ఎందుకనో స్టార్ట్ అయిన దగ్గరునుండి రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పటికే రివీల్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. వాస్తవానికి ఈ సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికి ఈ సినిమా షూటింగ్ పెండింగ్ దశలోనే ఉంది. కానీ దర్శకుడు మారుతి మాత్రం సమ్మర్‌లో అదిరిపోయే ట్రీట్ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. రీసెంట్‌గా మే నెల మిడ్‌లో అప్డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు మారుతి. హై అలర్ట్ మే నెలలో హీట్ వేవ్స్ మరింత పెరగనున్నాయి అని ఒక టీ-÷-వట్ చేశారు. దీంతో ఎలాంటి అప్డేట్ ఇవ్వబోతున్నాడా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు రెబల్ ఫ్యాన్స్. అయితే రాజాసాబ్ టీ-జర్ రిలీజ్‌కు మారుతీ ఎ÷-లాన్ చేస్తున్నట్టు-గా సమాచారం. ప్రస్తుతం సాలిడ్ టీజర్ కట్ చేసే పనిలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ టీజర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్ పనులు కూడా పూర్తయ్యాయని తెలుస్తోంది. ప్రస్తుతం విదేశాలలో ఉన్న ప్రభాస్ తిరిగి రాగానే తనతో డబ్బింగ్ పూర్తి చేసి టీజర్ విడుదల తేదీని రివీల్ చేస్తారని సమాచారం. అందాల భామలు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది.

# శర్వానంద్‌తో మరోమారు అనుపమ జోడీ

## సంపత్ నంది సినిమా కోసం కథ సిద్ధం



కబురు సినిమా ఏప్రిల్ 26:
టాలీవుడ్ నటుడు శర్వానంద్ తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. సంపత్ నంది ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. 1960ల చివర్లో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. మరపురాని అనుభూతిని కలిగించే పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే మూవీ కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు శర్వానంద్. మే మొదటివారం నుంచి షూటింగ్ శరవేగంగా ప్రారంభం కాబోతుండగా.. ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. ఇదిలావుంటే ఈ మూవీలో కథానాయికకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. గతంలో శర్వానంద్, అనుపమ కలిసి శతమానం భవతి అనే సినిమాలో నటించారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ జోడి మళ్లీ జత కదుతుండడంతో భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.



# అమ్మా,నాన్నల విడాకులు తీవ్రంగా కలచివేసింది

## నటి శృతిహాసన్ మనోగతం

కబురు సినిమా ఏప్రిల్ 26:
తల్లిదండ్రులు విడిపోతే పిల్లల జీవితాలు దుర్భరంగా మారుతాయి. ఒక్కోసారి తలకిందులవుతాయి. ముఖ్యంగా సినిమాపరిశ్రమలో విడాకుల వ్యవహారాలు చాలానే ఉన్నాయి. అందులో కమలహాసన్, సారికల ఎపిసోడ్ కూడా ఉంది. వారి కూతురే శృతిహాసన్. కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీక్రి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీక్రి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు. తాను ఇండస్ట్రీక్రి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com